క్లుప్తంగా

ఉత్తమ సేవలకు ప్రశంసలు



ఎంపీడీఓ సత్యనారాయణకు జ్ఞాపిక అందిస్తున్న కలెక్టర్ అనుదీప్

చుంచుపల్లి: రాష్ట్రపతి పర్యటనతో పాటు ముక్కోటి ఏకాదశి సందర్భంగా అంకితభావంతో భద్రాచలంలో విజయవంతంగా విధులను నిర్వహించిన పలువురు సిబ్బందిని కలెక్టర్ అనుదీప్ శనివారం తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. చుంచుపల్లి ఎంపీడీఓ సత్యనారాయణ టీమ్ సేవలను కలెక్టర్ కొనియాడారు. షీల్డ్‌లను బహూకరించారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలో సింగరేణి కార్పొరేట్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన న్యూ ఇయర్ క్యాలెండర్లను సింగరేణి డైరెక్టర్(పా) ఎస్.చంద్రశేఖర్, డైరెక్టర్ ఫైనాన్స్ ఎన్.బలరామ్ శనివారం ఆవిష్కరించారు. ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జీఎం పర్సనల్ ఏ.ఆనందరావు, జీఎం సీపీపీ నర్సింహారావు, జీఎం ట్రాన్స్‌పోర్ట్ దామోదర్‌రావు, జీఎంలు ఎన్.సుధాకర్ వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలి

పాల్వంచ: మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని క్లీన్ అండ్ గ్రీన్ ఎర్త్ సొసైటీ అధ్యక్షుడు భట్టు కృష్ణ, యువతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పోట్రు ప్రవీణ్, బుడగం నాగేశ్వరరావు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్‌కు శనివారం వినతిపత్రం అందించారు. మాట్లాడుతూ.. ఎన్నికలు నిర్వహించక పోవడం వల్ల అభివృద్ధి కుంటుపడిందన్నారు. మున్సిపాలిటీ కార్యాలయం పక్కన ఈనెల 10, 11 తేదీల్లో దీక్ష చేపడుతున్నామని, దీక్షకు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలపాలని కోరారు.

గురుకుల పాఠశాల తనిఖీ

పాల్వంచ: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, హాస్టల్‌ను కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, సేవాధికార సంస్థ సెక్రటరీ జి.భానుమతి, కొత్తగూడెం మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.దీప శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. తరగతి గదులు, కిచెన్‌రూం, స్టోర్ రూంలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, మెరుగైన సదుపాయాలు కల్పించాలని ప్రిన్సిపాల్, వార్డెన్లను ఆదేశించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మరుగుదొడ్లు సరిగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు.

సీపీఐ నియోజకవర్గ కన్వీనర్‌గా సారయ్య



ఇల్లెందు: సీపీఐ నియోజకవర్గ స్థాయి కమిటీ కన్వీనర్‌గా కె.సారయ్య ఎన్నికయ్యారు. శనివారం ఐతా ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సమక్షంలో 45 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సారయ్య మాట్లాడుతూ.. త్వరలో నియోజకవర్గ సమస్యలపై ఉద్యమాలను ఉధృతం చేస్తామని తెలిపారు.

ప్రజల వద్దకు 'ఆర్టీసీ'

ఇల్లెందు: పట్టణంలోని సుభాష్‌నగర్‌లో మహబూబాబాద్ ఆర్టీసీ అధికారులు ప్రజల వద్దకు ఆర్టీసీ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ జే.విజయ్ ఆర్టీసీలోని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు ఆర్టీసీని కాపాడుకోవాలని, బస్ ప్రయాణాల ద్వారా సురక్షిత ప్రయాణాలు చేయాలని సూచించారు. ప్రమాదాలు లేని ప్రయాణం ఆర్టీసీకే సాధ్యమన్నారు. అనంతరం అక్కడి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మహబూబాబాద్ డిపో బస్ సర్వీసులను కరెంటాఫీఎస్ వరకు నడపాలని, నైట్ సర్వీసులను కొనసాగించాలని స్థానికులు కోరారు.

పిల్లలను గురుకులంలో చేర్పించండి

జూలూరుపాడు: తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల, ఇంటర్ కళాశాల ప్రవేశాల కోసం జూలూరుపాడు జమా మజీద్ కమిటీ సభ్యులను మైనారిటీ జూనియర్ అసిస్టెంట్ అధికారి బి.సూరిబాబు శనివారం కలిశారు. మజీద్ కమిటీతో కలిసి సూరిబాబు ముస్లింల ఇళ్లకు వెళ్లి పిల్లలను గురుకుల పాఠశాల, ఇంటర్ కళాశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు మైనారిటీ పాఠశాల, ఇంటర్ కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

అద్భుతం.. అయ్యప్ప ఆలయం

- రూ.3కోట్లతో శరవేగంగా నిర్మాణ పనులు
- తమిళనాడు, కేరళ శిల్పులతో ఆలయ ప్రాకారాల ముస్తాబు
- వచ్చే నెల 5న విగ్రహ ప్రతిష్ఠ



పాల్వంచలో ముస్తాబవుతున్న అయ్యప్ప స్వామి ఆలయం

SUNDAY SPECIAL

పాల్వంచ: పాల్వంచలోని నూతన అయ్యప్ప స్వామి ఆలయం ఆధ్యాత్మికంగా ఆకట్టుకుంటోంది. 35 ఏళ్ల క్రితం తెలంగాణ రాష్ట్రంలోనే తొలి అయ్యప్ప దేవాలయాన్ని ఇక్కడ నిర్మించారు. ఇప్పుడు దానిని పూర్తిగా తొలగించి భక్తులు సహకారంతో రూ.3కోట్ల వ్యయంతో నూతనంగా అయ్యప్ప ఆలయం నిర్మిస్తున్నారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఫిబ్రవరి 5న విగ్రహ ప్రతిష్ఠ. ఆలయ నిర్మాణాన్ని చిన్న తిరుపతి, సింహాచలం దేవాలయ ప్రభుత్వ స్థపతి ఆకుల అమ్మని రాజా పర్యవేక్షణలో నిర్మాణ పనులు ప్రారంభం కాగా, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన శిల్పులు ఆలయ ప్రాకారాలను శోభాయమానంగా తీర్చి దిద్దారు. అయ్యప్ప స్వామి ఆలయానికి అనుసంధానంగా శివాలయం, ఆంజనేయ స్వామి ఆలయాలు కూడా ఉండటంతో ఇక్కడ ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. ప్రతి ఏటా ఇక్కడ దాదాపు 3 వేల మంది భక్తులు అయ్యప్ప మాలధారణ చేపడుతుంటారు. 100 రోజుల పాటు రోజుకు 500 మందికి అన్నదాన సత్రంలో భిక్ష ఆనవాయితీగా వస్తోంది.



ఆలయ మండపం..



ఆలయానికి రంగులు వేస్తున్న చిత్రకారులు

రెండు అంతస్తుల్లో ఆలయం..

అయ్యప్ప ఆలయాన్ని రెండు అంతస్తులతో చూడచక్కగా నిర్మిస్తున్నారు. కింద ధ్యాన మందిరం, పైన స్వామి సన్నిధానాలు సిద్ధం చేశారు. 18 మెట్లు, 43 అడుగుల ఏకశిల ధ్వజస్తంభం, 18 మెట్లకు ఇత్తడి తాపడం, 40 పిల్లర్లు, రెయిలింగ్, ఆలయం చుట్టూ అయ్యప్ప స్వరూపాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. సంవత్సరం నుంచి తమిళనాడు, కేరళ రాష్ట్రానికి చెందిన 25 మంది శిల్పులు ఆలయ ప్రాకారాలు తీర్చిదిద్దారు. కాకినాడకు చెందిన పలువురు ఆర్టిస్టులు రంగులు అద్దారు.

నాడు శిథిలావస్థ...

సుమారు ఎకరంన్నర స్థలంలో 1985లో అయ్యప్ప స్వామి ఆలయాన్ని తెలంగాణాలోనే పాల్వంచలో తొలుత స్వామి విమోచనానంద నిర్మించారు. ఈ ఆలయంలో గతంలో స్వామి విగ్రహాన్ని ఎత్తుకెళ్లేందుకు దొంగలు గడ్డపారలతో పెకిలించారు. అంతేకాకుండా ఈ ఆలయం శిథిలావస్థకు చేరింది. దీంతో నూతన ఆలయం నిర్మించేందుకు పెద్ద ఎత్తున స్థానిక భక్తులు ముందుకొచ్చారు. శబరిమలైలో వంశ పారంపర్యంగా పూజలు చేస్తున్న కంఠారి మోహనార్ తాంత్రి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5న విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు.

పనులు వేగంగా జరుగుతున్నాయి



పాల్వంచలోని అయ్యప్ప స్వామి ఆలయం తెలంగాణలోనే తొలి ఆలయంగా పేరు గాంచింది. శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని పూర్తిగా తొలగించారు. మరింత ఆకట్టుకునే విధంగా నూతన ఆలయ నిర్మాణ పనులు జరుగున్నాయి. విరాశాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

– కనగాల రాంబాబు, కమిటీ సభ్యుడు

పాల్వంచకే గొప్ప పేరు



అయ్యప్ప స్వామి నూతన ఆలయాన్ని తమిళనాడు, కేరళకు చెందిన అనేక మంది శిల్పులతో స్వామి ప్రాశస్త్యం తెలియజేసేలా బొమ్మలు వేయడం జరిగింది. కాకినాడకు చెందిన కార్మికులతో పెయింటింగ్ పనులు నడుస్తున్నాయి. ఈ ఆలయం పాల్వంచకే గొప్ప పేరు తెస్తుంది.

– మేడిద సంతోష్, కమిటీ సభ్యుడు

భవిష్యత్‌లో మరింత కీర్తి



ప్రతి ఏటా ఇక్కడ వేలాది మంది భక్తులు అయ్యప్ప మాలధరణ స్వీకరిస్తుంటారు. ఫిబ్రవరి 5న విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. భవిష్యత్‌లో ఈ ఆలయానికి మరింత కీర్తి ప్రతిష్టలు వచ్చేలా తీర్చిదిద్దుతున్నారు.

– బృందావనం నర్సింహామూర్తి, ఆలయ పూజారి

ప్రజాభిమానం సంపాదించండి



సతీష్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాములు నాయక్ తదితరులు

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, టీఆర్‌ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ పిలుపునిచ్చారు. శనివారం జూలూరుపాడు క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన దిశానిర్దేశం చేశారు. గ్రూపు రాజకీయాలకు పాల్పడకుండా సమన్వయంతో ముందుకు నడవాలని కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. త్వరలో గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం నూతనంగా బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన పొన్నెకంటి సతీష్ కుమార్‌ను బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే రాములు నాయక్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జూలూరుపాడు ఎంపీపీ లావుడ్యా సోనీ, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్యా కళావతి, సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గద్దె దింపుతాం..

కొత్తగూడెంటౌన్: గిరిజన బంధు పథకాన్ని తక్షణమే అమలు చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బానోతు రమేష్‌నాయక్ అన్నారు. శనివారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ గిరిజనులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని గిరిజన బంధు పథకం మార్గదర్శకాన్ని విడుదల చేయాలని కోరారు. గిరిజన బంధు పథకాన్ని అమలు చేయని పక్షంలో రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గద్దె దింపుతామన్నారు. కార్యక్రమంలో లావుడ్యా రమేష్‌నాయక్, రాజా నాయక్, వెంకన్న, భుక్యా సందీప్, పరమేష్ నాయక్ పాల్గొన్నారు.

శిశు సంరక్షణ సదుపాయం కల్పించాలి

సింగరేణి(కొత్తగూడెం): మహిళా ఉద్యోగులు పనిచేస్తున్న చోట పిల్లల సంరక్షణ కొరకు శిశు సంక్షేమ సదుపాయం (క్రీచ్) ఏర్పాటు చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు కోరారు. శనివారం మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ సవరణ 2017 సెక్షన్ 11 ఏ ప్రకారం ప్రతి సంస్థలో 50 మంది లేదా అంత కంటే ఎక్కువ మంది పనిచేసే మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సదుపాయం కొరకు పనిచేసే ప్రదేశంలో క్రీచ్ ఏర్పాటు చేయాలని, సంతకాల సేకరణ చేసి సింగరేణి డైరెక్టర్(పా)కు వినతి పత్రం అందజేశారు.

మాట్లాడుతూ.. ప్రతి మహిళా ఉద్యోగులు రోజులో నాలుగు సార్లు క్రీచ్‌కి వెళ్లడానికి అనుమతించాలని కోరారు. సింగరేణి కాలరీస్ సంస్థలో ప్రస్తుతం మహిళా ఉద్యోగులు ఎక్కువ మంది పనిచేస్తున్నారని మెయిన్ ఆస్పత్రి, హెడ్డాఫీస్, జీఎం ఆఫీస్, ఇతర డిపార్ట్‌మెంట్లలో, పని ప్రదేశాలలో పిల్లలకు రక్షణ సదుపాయం లేకపోవటం వల్ల మహిళా ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వెంటనే సింగరేణిలోని అన్ని ఏరియాలో క్రీచ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాజారావు, వై.వెంకటేశ్వర్లు, సూరం అయిలయ్య, శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

అధికారులకు ఆటలపోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న సింగరేణి డైరెక్టర్ బలరాం

కొత్తగూడెంటౌన్: యువత క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని, క్రీడలతో మానసిక, శారీరకంగా దృఢంగా తయారవుతారని సింగరేణి డైరెక్టర్ బలరాం అన్నారు. శనివారం కొత్తగూడెం కేసీఓఏ క్లబ్‌లో షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ భద్రాద్రి కొత్తగూడెం ఆధ్వర్యంలో పోటీలను సింగరేణి డైరెక్టర్ బలరాం, డీపీఆర్‌ఓ ఆశోకచక్రవర్తి, డీఎస్పీ వెంకటేశ్వరబాబు, డీపీఆర్‌ఓ శ్రీనివాసలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం డైరెక్టర్ బలరాం, డీఎస్పీ వెంకటేశ్వరబాబు, డీఆర్‌ఓ ఆశోక చక్రవర్తి, డీపీఆర్‌ఓ శ్రీనివాస్‌లు జట్లుగా ఏర్పడి పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం డైరెక్టర్ బలరాం మాట్లాడారు. కార్యక్రమంలో కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ బత్తుల సత్యనారాయణ, చుంచుపల్లి సీఐ రమాకాంత్, పి.వాసు, బ్యాడ్మింటన్ అధ్యక్షుడు రాజశేఖర్ అయ్యప్ప, ఉపాధ్యక్షుడు యనమదల వేణుగోపాల్, నారదాసు వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎం.చైతన్యకృష్ణ, ఆర్‌ఐలు బి.సోములు, తుత్తురి దామోదర్, దారావత్ రమేష్, యతిరాజ్‌కుమార్, ఎర్ర నాగేశ్వర్, పండుగ రేశ్వంత్, తేలుకుంట్ల రామ్ కుమార్ పాల్గొన్నారు.

18 నుంచి ఉర్సు వేడుకలు

టేకులపల్లి: కులమతాలకు అతీతంగా ప్రతి సంవత్సరం ఎంతో వైభవంగా జరుపుకునే బేతంపూడి ఉర్సు వేడుకలు ఈ నెల 18 నుంచి ప్రారంభం అవుతాయని దర్గా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే.పాషా, ఎస్‌కే ఫరీద్ తెలిపారు. శనివారం దర్గా ఆవరణలో ఉర్సు వేడుకలకు సంబంధించిన వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు ఖయ్యూం, జానీ, ఖాజా మొయినుద్దీన్, ఎండీ.సాబీర్, నదీమ్, సలీం, షఫీ, షకీల్, జమాల్, పాషా పాల్గొన్నారు.

వితరణ

పాల్వంచరూరల్: మండల పరిధి లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీలోని సాయిబాబా గుడి సమీపంలోని అనాథాశ్రమంలోని బాలలకు శనివారం రామోజీ రమేష్ పుట్టినరోజు సందర్భంగా 50 కేజీల బియ్యం, అల్పాహారం వితరణ చేశారు. కార్యక్రమంలో బట్టు కృష్ణ, రామోజీ వెంకటలక్ష్మి, హరిబాబు, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో దుకాణాల తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్‌లోని షాపుల్లో నాణ్యతతో పాటు అధిక ధరలకు వస్తువులు, తినుబండాలను అమ్మకాలు జరుపుతున్నారు. ఈ మేరకు శనివారం సాక్షిలో ప్రచురితమైన 'నాణ్యతకు తిలోదకాలు'అనే కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న పలు షాపులను తనిఖీ చేసి వస్తువులను పరిశీలించారు. స్వయంగా స్టేషన్‌మాస్టర్ పెంటి.రాంబాబు ప్రతిషాపుకు వెళ్లి తినుబండారాలను పరిశీలించారు. ఎమ్మార్పీ కంటే అధిక రేట్లకు అమ్మకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యత లేని తినుబండాలను ఆర్టీసీలో అనుమతించమని, అలాంటి వాటి విషయంలో జాగ్రత్తలు పాటించాలని షాపు యజమానులను సూచించారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయండి

ఇల్లెందురూరల్: అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని న్యూడెమోక్రసీ పట్టణ కార్యదర్శి కొక్కు సారంగపాణి డిమాండ్ చేశారు. మండలంలోని 21పిట్ ఏరియా విజయలక్ష్మీనగర్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఉద్యమాల ద్వారా సాధించుకున్న రాష్ట్రంలో పేదలకు కనీసం గూడు కూడా కల్పించలేని దుస్థితిలో పాలన సాగుతోందని విమర్శించారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, వెంటనే ఇళ్లు మంజూరు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 12న నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో తేజావత్ లాలు, బండి లక్ష్మణ్, ఉపేందర్, స్వరూప, కల్యాణి, శారద, నాగమణి, పార్వతి, విజయ, కొమరమ్మ, పరశురాములు, సమ్మయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి ముఖేష్

ఇల్లెందు: చట్టాల పట్ల అందరికీ అవగాహన ఉండాలని న్యాయమూర్తి జే.ముఖేష్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ సేవా అధికార సంస్థ, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు అధ్యక్షతన శనివారం న్యాయ చైతన్య సదస్సు జరిగింది. న్యాయమూర్తి ముఖేష్ మాట్లాడుతూ.. భారత పౌరులందరికీ చట్టాల పట్ల సంపూర్ణ అవగాహన ఉండాలని, ఏ నేరానికి ఎలాంటి శిక్షలు ఉంటాయో తెలిస్తే అలాంటి నేరాలు చేసే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిని బట్టి న్యాయం మారదని, చట్టాలను గౌరవించాలని, విద్య, మనిషి ప్రవర్తన పెంపొందించుకునే దిశగా కొనసాగించాలని చెప్పారు. తోటి వ్యక్తుల పట్ల ప్రేమ, అభిమానం, గౌరవం పెంపొందించాలని సూచించారు. పెళ్లి వయస్సు రాకముందే పెళ్లి జరిగితూ అది కూడా నేరమవుతందున్నారు. బాల్యవివాహాలను నిరోధించాలన్నారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే జైలు శిక్ష, జరిమానా విధించడబడుతుందని హెచ్చరించారు. ప్రతి వ్యక్తి నైతిక విలువలతో సమాజం పట్ల ప్రేమ, వ్యక్తుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్య మనిషి ఉన్నతిని పెంపొందించబడుతున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామలింగేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్, నాగేశ్వరరావు, రబ్బానీ, ఉమామహేశ్వర్‌రావు, అనిల్, కార్తీక్, తోర్తి జాన్, విలియం ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు .

ఆరోగ్య పరిరక్షణకే 6కే రన్

సింగరేణి(కొత్తగూడెం): ఆరోగ్య పరిరక్షణకు 6కే రన్ నిర్వహిస్తున్నామని విద్యార్థులు, యువకులు, పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని సెయింట్ జోసఫ్ పాఠశాల ప్రిన్సిపాల్ విజ్ఞప్తి చేశారు. శనివారం 6కే రన్ లోగోను విడుదల చేశారు. మాట్లాడుతూ.. పాఠశాల ఏర్పడి 60 సంవత్సరాలు అయిన సందర్భంగా ఫిబ్రవరి 4, 5 తేదీలలో వజ్రోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఈనెల 8న 6కే రన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ డైమండ్ జూబ్లీ వేడుకల నిర్వహణ ఖర్చులన్నీ పూర్వవిద్యార్థులు చూసుకోవడం విశేషమన్నారు. కార్యక్రమంలో సాయికృష్ణ, పసుపులేటి శ్రీని వాస్, పాఠశాల ప్రిన్సిపల్ రాజశేఖర్‌రెడ్డి పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే విజయం మనదే



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మాజీ డైరెక్టర్ రవీంద్రకుమార్

పాల్వంచ: పట్టుదల ఉంటే విజయాన్ని సొంతం చేసుకోవచ్చని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ మాజీ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రహీత వినపల్లి వెంకటసత్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక కేఎల్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఐదు రోజులు జరగనున్న క్రీడా పోటీలను వారు ప్రారంభించారు. మాట్లాడుతూ.. విద్యార్థుల మానసిక ఎదుగుదలకు, శారీరక ధృడత్వానికి, మానసికోల్లాసానికి క్రీడలు ఉపయోగపడతాయన్నారు. క్రీడల్లో ప్రాథమిక విద్య నుంచే రాణించాలని చెప్పారు. కేఎల్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ నాగమణి మాట్లాడుతూ.. క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. డైరెక్టర్లు కాశీ విశ్వనాథం, మురళీ ప్రసాద్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సురేంద్రకుమార్, ఎస్‌బీపీఎస్, జూనియర్, బీఈడీ, ఫిజియోథెరపీ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్స్ సుమతి, నరసింహారావు, సుమన్, సునీల్ డేవిడ్, పురుషోత్తం హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలి

కొత్తగూడెంఅర్బన్: మున్నూరుకాపు కులస్తులకు ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్యపటేల్ అన్నారు. శనివారం కొత్తగూడెం వచ్చిన ఆయన కూలీలైన్ ఏరియాలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణి సంస్థను నమ్ముకొని జీవనోపాధి కొరకు వచ్చిన దశాబ్దాలుగా స్థిరపడిన మున్నూరుకాపులకు ఎటువంటి షరతులు లేకుండా కులధృవీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు.

కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో ఉన్నత చదువులు, ఉద్యోగావకాశాలు కోల్పోతున్నట్లు చెప్పారు.

బడికెళ్లని పిల్లల వివరాలు సేకరించండి



మాట్లాడుతున్న నాగరాజశేఖర్



హాజరైన ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు

పాల్వంచ: ప్రతి గ్రామంలో బడి బయటి పిల్లల వివరాలు సేకరించాలని జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ ఎ.నాగరాజశేఖర్ అన్నారు. స్థానిక సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు, ఐఈఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. బడి బయటి పిల్లల వివరాలను సర్వే ద్వారా సేకరించి వివరాలను ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. పోర్టల్‌లో నమోదైన ప్రతి విద్యార్థిని వారి వయస్సుకు తగిన పాఠశాలలో చేర్పించాలన్నారు. బడి బయటి పిల్లలు లేని మండలాలుగా ప్రకటించాలని కోరారు. అనంతరం సహాయ గణాంక అధికారి సతీష్ మాట్లాడుతూ.. యూడైస్‌లో పాఠశాల సమాచారం నింపడంలో మెళకువలను వివరించారు. అదేవిధంగా ప్రత్యేక అవసరాల పిల్లలను వివరాలను సైతం పోర్టల్‌లో నమోదు చేయాలని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమీషనర్ ఎస్.మాధవరావు, ఎంఈఓ శ్రీరామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలులో సీఎం కేసీఆర్ విఫలం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కల్యాణ్ నాయక్

ఇల్లెందు: తొమ్మిదేళ్ల అధికారంలో ఉన్న టీఆర్‌ఎస్ అన్ని రంగాల్లో విఫలమయిందని బీజేపీ నియోజకవర్గ పాలక్ డాక్టర్ కల్యాణ్ నాయక్ తీవ్రంగా విమర్శించారు. శనివారం పట్టణంలోని ఐతా ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఇల్లెందు నియోజకవర్గ పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల సమ్మేళనాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయలేకపోయారని విమర్శించారు. దీనివల్ల రైతులు వడ్డీలు భరించాల్సి వచ్చిందన్నారు. ప్రతి నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు సాగు నీరు అందిస్తామన్న వాగ్దానం అటకెక్కిందన్నారు. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదని వాపోయారు. మోదీ పాలనలో దేశం ప్రపంచ దేశాల సరసన చేరిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడించి బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాళ్ల సోమసుందర్, జి.రాంచందర్ నాయక్, ఊకె అబ్బయ్య, బలగానీ గోపీకృష్ణ, హతీరాం నాయక్, మోకాళ్ల నాగస్రవంతి, రేఖాసింగ్, సంజీవరెడ్డి, ఖాజా, రామయ్య, మురళీకృష్ణ, మిర్యాల వెంకటేశ్వర్లు, రేవళ్ల నాగరాజు, శాసనాల రామయ్య, జమునారెడ్డి, సునిత, రజత్ కోరీ, రాహుల్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

రహదారికి నోచుకోని డొంక దారి



టేకులపల్లి మండలం బేతంపూడి పంచాయతీ అబ్బిరెడ్డిగూడెం గ్రామానికి దశాబ్దాలుగా పక్కా రోడ్డు సౌకర్యం లేదు. దీంతో స్థానిక ఆదివాసీలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పాలకులు మారుతున్నా ఈ గ్రామానికి రహదారి సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. వర్షం పడితే ఇక అంతే సంగతులు. ఇళ్లకే పరిమితం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అబ్బిరెడ్డిగూడెంకు పక్కా రోడ్డు నిర్మించాలని ఆదివాసీలు కోరుతున్నారు. - టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : రాజు, ఏఈ, పీఆర్ టేకులపల్లి
సెల్ నంబర్ : 9676029621